
నన్ను గెలిపించండి.. ఐదేళ్లు మీ కోసం పనిచేస్తా

- చేవెళ్ల ఎంపీ అభ్యర్థి డాక్టర్ గడ్డం రంజిత్‌రెడ్డి
- కాంగ్రెస్ పార్టీలో చేరిన బీఆర్ఎస్ నాయకులు

రాజేంద్రనగర్, మే 9(ఆంధ్రజ్యోతి): చేవెళ్ల కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న నన్ను గెలిపిస్తే ఆ తర్వాత ఐదు సంవత్సరాలు మీ కోసం నేను పనిచేస్తానని డాక్టర్ గడ్డం రంజిత్‌రెడ్డి అన్నారు. రాజేంద్రనగర్ నియోజకవర్గానికి చెందిన పలువురు బీఆర్ఎస్ ముఖ్యనేతలు గురువారం జూబ్లీహిల్స్‌లో రంజిత్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా డాక్టర్ రంజిత్‌రెడ్డి మాట్లాడుతూ తన ఇంటి తలుపులు ఎల్లవేళలా ప్రజ ల కోసం తెరిచే ఉంటాయని అన్నారు. ఆరు గ్యారెంటీలను పక్కా గా అమలు చేసి చూపుతామని అన్నారు. రాష్ట్రంలో సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో పార్టీ ప్రజల కోసమే పనిచేస్తుందని ఆయన వివరించారు. కాంగ్రెస్‌లో చేరిన వారిలో బీఆర్ఎస్ నాయకులు రాపోలు సత్తయ్య, కె.సత్యనారాయణగౌడ్, నారాయణస్వామి, పెదిరిపాటి శేఖర్‌గౌడ్ ఉన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకుడు ఎ.దేవదాస్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.


డాక్టర్ రంజిత్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరుతున్న రాపోలు సత్తయ్య, కె.సత్యనారాయణగౌడ్, నారాయణస్వామి, పి.శేఖర్‌గౌడ్

రంజిత్‌రెడ్డికి మద్దతుగా మేయర్ ప్రచారం

సరూర్‌నగర్, మే 9(ఆంధ్రజ్యోతి): చేవెళ్ల స్థానం నుంచి పోటీ చేస్తున్న కాంగ్రెస్ అభ్యర్థి గడ్డం రంజిత్‌రెడ్డికి మద్దతుగా ఆ పార్టీ నేతలు ప్రచారాన్ని ముమ్మరం చేశారు. బడంగ్‌పేట్ కార్పొరేషన్‌లో పార్టీ నాయకులు, కార్యకర్తలతో పాటు టీపీసీసీ ప్రధాన కార్యదర్శి, బడంగ్‌పేట్ మేయర్ చిగిరింత పారిజాతానర్సింహారెడ్డి, పార్టీ కార్పొరేటర్లు కాలనీల్లో విస్తృతంగా పర్యటిస్తూ ఓటర్లను వ్యక్తిగతంగా కలుస్తూ హస్తం గుర్తుకు ఓటేయాలని కోరుతున్నారు. మేయర్ పారిజాత ఉదయం, సాయంత్రం వేళల్లో రోడ్‌మ్యాప్ రూపొందించుకుని, దాని ప్రకారం రోడ్‌షోలు, పాదయాత్రలు, కార్నర్‌మీటింగ్‌లు నిర్వహిస్తూ ప్రచారంలో జోరు పెంచారు. ఇందులో భాగంగా బుధవారం రాత్రి ఆమె గుర్రంగూడలోని పలు కాలనీల్లో పాదయాత్ర చేసి ఓటర్లను కలిసి సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వాన్ని బలపరుస్తూ కాంగ్రెస్ అభ్యర్థి రంజిత్‌రెడ్డికి ఓటేయాలని విజ్ఞప్తి చేశారు. అదేవిధంగా గురువారం ఉదయం బడంగ్‌పేట్, అల్మాస్‌గూడ, వెంకటాపూర్ తదితర గ్రామాల్లోని పలు కాలనీల్లో విస్తృతంగా పర్యటించి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.


రంజిత్‌రెడ్డికి మద్దతుగా గుర్రంగూడలో పాదయాత్ర చేస్తూ ప్రచారం నిర్వహిస్తున్న పారిజాతారెడ్డి

బాలాపూర్‌లో..

బడంగ్‌పేట్ కార్పొరేషన్‌లోని బాలాపూర్ 17వ డివిజన్ పరిధిలోని పలు కాలనీల్లో బుధవారం రాత్రి కౌన్సిల్ ఫ్లోర్ లీడర్ వంగేటి ప్రభాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో రంజిత్‌రెడ్డికి మద్దతుగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. గురువారం ఉదయం బాలాపూర్ పాత గ్రామంలో పర్యటించి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

రంజిత్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలి

- జడ్పీ చైర్‌పర్సన్ అనితారెడ్డి

మహేశ్వరం: చేవెళ్ల పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ తరఫున పోటీలో ఉన్న రంజిత్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని రంగారెడ్డిజిల్లా పరిషత్ చైర్‌పర్సన్ అనితారెడ్డి, మహేశ్వరం నియోజకవర్గ ఇన్‌చార్జి కేఎల్లార్ అన్నారు. గురువారం మండలంలోని అమీర్‌పేట, గట్టుపల్లి, మన్‌సాన్‌పల్లి, డబిల్‌గూడ, మహేశ్వరం, తుమ్మలూరు, మొహబత్‌నగర్, కోళ్లపడకల్, దిల్వార్‌గూడ గ్రామాల్లో ఇంటింటి ప్రచారం నిర్వహించిన వారు కాంగ్రెస్ ప్రకటించిన గ్యారెంటీలను ప్రజలకు వివరించారు. అదేవిధంగా అటు దేశంలో బీజేపీ ఇటు రాష్ట్రంలో బీఆర్ఎస్ పదేండ్లు అధికారంలో ఉండి పేదలకు చేసింది ఏమీ లేదన్నారు. తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో ఉందని అదే తరహాలో కేంద్రం లో కూడా కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటు కావడం ఖాయమన్నారు. అదేవిధంగా అమీర్‌పేట గ్రామానికి చెందిన బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు అంజయ్య, డబిల్‌గూడకు చెందిన ఇస్తారిలతో పాటు ఆయా గ్రామాలనుండి బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు అనితారెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. కార్యక్రమంలో మం డల ఇన్‌చార్జి ఎంపీపీ ఆర్. సునీతాఅంద్యానాయక్, మర్యాద రాఘవేందర్‌రెడ్డి, దేవేందర్‌నాయక్, తారాసింగ్ పాల్గొన్నారు.


బాలాపూర్‌లో ఇంటింటి ప్రచారం చేస్తున్న బడంగ్‌పేట్ కౌన్సిల్ ఫ్లోర్ లీడర్ ప్రభాకర్‌రెడ్డి తదితరులు

కారు గుర్తుకు ఓటేసి అభివృద్ధికి పునాదులు వేయాలి

- ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి

కొత్తపేట, మే 9(ఆంధ్రజ్యోతి): కారు గుర్తుకు ఓటు వేసి మల్కాజిగిరి బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డిని గెలిపించి మరింత అభివృద్ధికి పునాదులు వేయాలని ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. గురువారం కొత్తపేట జైన్ మందిర్ నుంచి మోహన్‌నగర్ వరకు అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డికి మద్దతుగా ఆయన భారీ ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో మహిళలు ఆయనకు హారతులిచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎప్పటికీ అందుబాటులో ఉండే నాయకుడిని ఎన్నుకోవాలని, కాంగ్రెస్ పార్టీ మోసపూరిత వాగ్దానాలు చేసి గద్దెనెక్కిన తర్వాత ప్రజాసమస్యలను గాలికి వదిలేసిందని ఎద్దేవా చేశారు. ప్రజలు ఇప్పుడు మార్పు కోరుకుంటున్నారని తెలిపారు. కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు రాహుల్‌గౌడ్, మాజీ కార్పొరేటర్ సాగర్‌రెడ్డి, మహేష్‌రెడ్డి, విజయగౌడ్, ఉదయ్‌గౌడ్ పాల్గొన్నారు.


అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డితో కలిసి ఏఎస్‌రావునగర్‌లో ప్రచారం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి తదితరులు


ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డికి హారతులిస్తున్న మహిళలు

ఏఎస్‌రావునగర్‌లో ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి, అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి ఇంటింటి ప్రచారం

ఏఎస్‌రావునగర్, మే 9 (ఆంధ్రజ్యోతి): లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో భాగంగా గురువారం బీఆర్ఎస్ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి, ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డిలు ఏఎస్‌రావునగర్‌లో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. జమ్మిగడ్డ ఎన్టీఆర్ విగ్రహం వద్ద ప్రారంభమైన ప్రచారం జమ్మిగడ్డ, జైజవాన్‌కాలనీ, జీఆర్‌రెడ్డినగర్, బీజేఆర్ కాలనీ, ఏఎస్‌రావునగర్, కమలానగర్, మహేష్‌నగర్, హైటెన్షన్ లేన్ తదితర ప్రాంతాలలో కొనసాగింది. కారు గుర్తుకు ఓటు వేసి రాగిడి లక్ష్మారెడ్డిని ఎంపీగా గెలిపించాలని ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి ప్రజలను కోరారు. కార్యక్రమంలో కార్పొరేటర్ సింగిరెడ్డి శిరిషా సోమశేఖర్‌రెడ్డి, బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు కాసం మహిపాల్‌రెడ్డి, నాయకులు సోమశేఖర్‌రెడ్డి, షేర్ మణెమ్మ, పెద్దాపురం కుమారస్వామి, శిరిషారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ మోర్చా జిల్లా కార్యదర్శిగా నాగార్జునబాబు నియామకం

సరూర్‌నగర్, మే 9(ఆంధ్రజ్యోతి): బీజేపీ ఎస్సీ మోర్చా రంగారెడ్డి జిల్లా కమిటీ కార్యదర్శిగా బడంగ్‌పేట్ కార్పొరేషన్‌లోని బాలాపూర్‌కు చెందిన పార్టీ నాయకుడు గుండె నాగార్జునబాబు నియమితులయ్యారు. ఈ మేరకు మోర్చా జిల్లా అధ్యక్షుడు జ్ఞానేశ్వర్ గురువారం ఆయనకు నియామక పత్రం అందజేశారు. నాగార్జున గతంలో రెండు పర్యాయాలు బడంగ్‌పేట్ కార్పొరేషన్ ఎస్సీ మోర్చా అధ్యక్షుడిగా పనిచేశారు. కాగా తనకు జిల్లా కమిటీలో పదవి రావడానికి సహకరించిన పార్టీ నాయకులకు ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.


రోడ్‌షోలో మాట్లాడుతున్న మాజీమంత్రి, ఎమ్మెల్యే సబితారెడ్డి


బడంగ్‌పేట్ 1వ డివిజన్‌లో ప్రచారం చేస్తున్న కాసాని కుటుంబ సభ్యులు మాధవి, సాయి, పార్టీ నేతలు

పాలనను మరచి కేసీఆర్‌ను తిట్టడానికి పోటీ

- మాజీమంత్రి, ఎమ్మెల్యే సబితారెడ్డి

ఎల్బీనగర్, మే 9(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వంలోని మంత్రులు పాలనను మరచి కేవలం కేసీఆర్‌ను తిట్టడానికి పోటీపడుతున్నారని మాజీమంత్రి, ఎమ్మెల్యే సబితారెడ్డి అన్నారు. చేవెళ్ల బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్‌ముదిరాజ్‌ను గెలిపించాలని కోరుతూ గురువారం ఆర్‌కేపురం డివిజన్ పరిధిలోని ఎన్టీఆర్‌నగర్‌లో రోడ్‌షో నిర్వహించి కార్నర్ మీటింగ్‌లో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కార్యకర్తల బలంతో మహేశ్వరం నియోజకవర్గాన్ని కంచుకోటగా మార్చామని అన్నారు. ప్రభుత్వంలో ఉంటేనే పనిచేయాలని ఏమీ లేదన్నారు. ప్రతిపక్షంలో ఉన్నా కొట్లాడి పనిచేయించే శక్తి ప్రజలు తనకిచ్చారన్నారు. పాలకులు పాలనను గాలికి వదిలేసి కేవలం కండువాలను కప్పడానికే ప్రాధాన్యత ఇస్తున్నారని ఆమె విమర్శించారు. కాంగ్రెస్ మోసపూర్తి వాగ్దానాలను ఇచ్చిందని ప్రజలకు తెలిసిపోయిందన్నారు. కేసీఆర్ పాలన కావాలంటే కాసాని జ్ఞానేశ్వర్‌ను అత్యధిక ఓట్ల మెజారిటీతో గెలిపించాలని ప్రజలను కోరారు. ఈ రోడ్‌షోలో ఎమ్మెల్సీ దయానంద్‌గుప్తా, మండలి మాజీ చైర్మన్ స్వామిగౌడ్, గ్రంథాలయ పరిషత్ మాజీ చైర్మన్ ఆయాచితం శ్రీధర్, బీఆర్ఎస్ మహేశ్వరం నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి మురుకుంట్ల అరవింద్‌శర్మ, ఆర్‌కేపురం డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు పెండ్యాల నగేష్, ఇంటూరి అంకిరెడ్డి, సాజిద్, శ్రీనివాస్, మల్లేష్, రిషి పాల్గొన్నారు.

బడంగ్‌పేట్‌లో కాసాని కుటుంబ సభ్యుల ప్రచారం

సరూర్‌నగర్, మే 9(ఆంధ్రజ్యోతి): చేవెళ్ల ఎంపీ స్థానంలో బీఆర్ఎస్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న కాసాని జ్ఞానేశ్వర్‌కు మద్దతుగా గురువారం బడంగ్‌పేట్ కార్పొరేషన్‌లోని 1వ డివిజన్‌లో గల పలు కాలనీల్లో కార్పొరేటర్ పెద్దబావి శ్రీనివాస్‌రెడ్డితో కలిసి కాసాని కుటుంబ సభ్యులు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కాసాని పెద్ద కోడలు మాధవి, చిన్న కుమారుడు సాయి ఇక్కడి ఓటర్లను కలిసి కారు గుర్తుకు ఓటేసి బీఆర్ఎస్‌ను గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. కేసీఆర్ నాయకత్వంలో తెలంగాణ ఎంతో అభివృద్ధి సాధించిందని, కాంగ్రెస్ రాగానే ప్రజలకు కష్టాలు మొదలయ్యాయని వారు విమర్శించారు. కార్యక్రమంలో పలువురు కార్పొరేటర్లు, డివిజన్ అధ్యక్షులు, కాలనీల ప్రతినిధులు పాల్గొన్నారు.

మీర్‌పేట్‌లో..

మీర్‌పేట్ కార్పొరేషన్ 36వ డివిజన్‌లోని పలు కాలనీల్లో బీఆర్ఎస్ మీర్‌పేట్ శాఖ వర్కింగ్ ప్రెసిడెంట్ దిండు భూపేశ్‌గౌడ్ ఆధ్వర్యంలో చేవెళ్ల బీఆర్ఎస్ అభ్యర్థి కాసానికి మద్దతుగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కేంద్రం మెడలు వంచి రాష్ట్రానికి నిధులు తీసుకువచ్చి అభివృద్ధి చేయించాలంటే కేసీఆర్ నేతృత్వంలోని బీఆర్ఎస్ అభ్యర్థులను గెలిపించాలని ఆయన ఓటర్లను కోరారు. కార్యక్రమంలో పలువురు బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి.ప్రకాశ్‌గౌడ్

ఎంపీగా కాసానిని గెలిపించండి: ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్

రాజేంద్రనగర్, మే 9(ఆంధ్రజ్యోతి): చేవెళ్ల బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్‌ముదిరాజ్‌ను భారీ మెజార్టీతో గెలిపించుకోవడానికి ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలతో పాటు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి.ప్రకాశ్‌గౌడ్ సూచించారు. మైలార్‌దేవుపల్లి దుర్గా కన్వెన్షన్‌లో గురువారం బీఆర్ఎస్ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రకాశ్‌గౌడ్ మాట్లాడుతూ నలభై సంవత్సరాలుగా బీసీల హక్కుల కోసం పోరాడుతున్న కాసాని జ్ఞానేశ్వర్‌ముదిరాజ్‌కు బీసీలంతా అండగా ఉండాలన్నారు. మోహన్‌రెడ్డి అనే కాంగ్రెస్ నేత దమ్ముంటే బీసీ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్‌ను గెలిపించుకోవాలని వీడియో పెట్టి సవాల్ విసిరారని, ఆయనకు బుద్ధి చెప్పాలంటే బీసీ సంఘాలన్నీ ఏకమై కాసాని జ్ఞానేశ్వర్‌ను గెలిపించుకోవాలని విజ్ఞప్తి చేశారు. తాను బీఆర్ఎస్‌లోనే ఉంటానని ప్రకాశ్‌గౌడ్ స్పష్టం చేశారు. సమావేశంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు నాగేందర్‌గౌడ్, పుటం పురుషోత్తంరావు, తలారి మల్లేశ్, ప్రకాశన్న యువసేన అధ్యక్షుడు టి.రాముగౌడ్, లక్ష్మీరాజ్, గుమ్మడి కుమార్, డి.రమేశ్ ముదిరాజ్, వజ్రమ్మ, ఎడ్లకాడి సూర్యం, బి.రాజేశ్‌యాదవ్, భూదేవీ, రాజు ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

మోసపూరిత వాగ్దానాలతో గద్దెనెక్కిన కాంగ్రెస్‌కి బుద్ధిచెప్పాలి

- బీజేపీ ఎంపీ అభ్యర్థి ఈటల రాజేందర్

వనస్థలిపురం, మే 9(ఆంధ్రజ్యోతి): మోసపూరిత వాగ్దానాలతో గద్దెనెక్కిన కాంగ్రెస్ ప్రభుత్వానికి ఎన్నికల్లో బుద్ధిచెప్పి నన్ను భారీ మెజార్టీతో గెలిపించాలని మల్కాజిగిరి బీజేపీ అభ్యర్థి ఈటల రాజేందర్ అన్నారు. పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో భాగంగా మన్సూరాబాద్ కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి ఆధ్వర్యంలో డివిజన్‌లోని మల్లికార్జుననగర్ సంక్షేమ సంఘం భవనంలో ఆదర్శ్ సీనియర్ సిటిజన్స్ ప్రతినిధులు నిర్వహించిన ఆత్మీయ సమావేశానికి ఈటల ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. రాబోయే ఎన్నికల్లో ధర్మంవైపు నిలబడే నాయకత్వానికి, ప్రజల నమ్మకాన్ని వమ్ముచేయకుండా మీ కష్టసుఖాల్లో పాలుపంచుకునేందుకు మీ ముందుకు వచ్చిన నన్ను అత్యధిక ఓట్లు వేసి మల్కాజిగిరి ఎంపీగా గెలిపించాలని కోరారు. హిందు దేవుళ్లను అవహేళన మాటలతో హిందువుల మనోభావాలను కించపరిచే విధంగా మాట్లాడుతున్న తీరు ప్రజలు గమనిస్తున్నారని, దానికి కాలమే సమాధానం చెబుతుందన్నారు. సోషల్ మీడియాలో మార్ఫింగుల పేరిట బీజేపీపై అధికార కాంగ్రెస్ పార్టీ నాయకులు తప్పుడు ప్రచారం చేస్తున్నారని, ఎన్ని అడ్డంకులు తలపెట్టినా బీజేపీ గెలుపును ఆపలేరని, ప్రజలు బీజేపీ వైపే ఉన్నారని తెలిపారు. ప్రజలకు సంక్షేమ పథకాలను కొనసాగించడానికి నన్ను భారీ మెజార్టీతో గెలిపించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో బీజేపీ రంగారెడ్డి అర్బన్ జిల్లా అధ్యక్షుడు సామ రంగారెడ్డి, నాయకులు కొత్త రవీందర్‌గౌడ్, కళ్లెం రవీందర్‌రెడ్డి, నాంపల్లి రామేశ్వర్, నాయకులు, కాలనీవాసులు పాల్గొన్నారు.


ఎన్నికల ప్రచారంలో మాట్లాడుతున్న ఈటల రాజేందర్

మోసగించే ప్రకటనలు చేస్తే నడవదు బిడ్డా అని రేవంత్‌రెడ్డికి చెప్పాలె

కొత్తపేట: రేవంత్‌రెడ్డికి ఇంకా మోసగించే ప్రకటనలు చేస్తే నడవదు బిడ్డా అని చెప్పాలె అని మల్కాజిగిరి బీజేపీ ఎంపీ అభ్యర్థి ఈటల రాజేందర్ ఓటర్లకు సూచించారు. కొత్తపేట కార్పొరేటర్ పవన్ కుమార్ ఆధ్వర్యంలో గురువారం శివగంగకాలనీ సదాశివేశ్వరాలయంలో ప్రత్యేక పూజలు చేయించిన అనంతరం ఆయన శివమ్మనగర్, అంబేడ్కర్‌నగర్, భరత్‌నగర్-1,2, రాజీవ్‌గాంధీనగర్ -1,2 బస్తీల్లో రంగారెడ్డి అర్బన్ జిల్లా అధ్యక్షుడు సామ రంగారెడ్డితో కలిసి పాదయాత్ర చేశారు. అడుగడుగునా మహిళలు ఆయనకు హారతులిచ్చారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ఎన్నికల వేళ కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను నెరవేర్చలేదని ఆయన ప్రస్తావించారు. నెలకు రూ.2500 ఇస్తామన్నారు, కల్యాణలక్ష్మి చెక్కులప్పుడు తులం బంగారం ఇస్తామన్నారు, చదువుకునే ఆడపిల్లలకు స్కూటీలిస్తమన్నరు ఈ హామీల మాటేమిటని అడగాలె అని గుర్తు చేశారు. మళ్లీ ప్రధానమంత్రి నరేంద్రమోదే వస్తరని, తన లాంటి వాళ్లు ఎంపీగా ఉంటే బస్తీల్లో మెరుగైన మౌలిక సదుపాయాల కల్పన, ఉద్యోగావకాశాలు సొంత ఇళ్ల సమస్యల పరిష్కారం సులభమవుతుందన్నారు. 14 ఏళ్లు తెలంగాణ బిడ్డగా చూస్తున్నరని, ఆర్థిక మంత్రిగా ఉన్నప్పుడు ప్రభుత్వ పాఠశాలల్లో, వసతిగృహాల్లో పిల్లల్లో సన్నబియ్యం వండేలా జీఓ తెచ్చిన బిడ్డ నేనే అని గుర్తు చేశారు. పాదయాత్రలో బీజేపీ రాష్ట్ర నాయకుడు యశ్పాల్‌గౌడ్ ఈటల రాజేందర్‌కు తులసి మాల వేసి ఖడ్గం బహూకరించారు. కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షురాలు నంగి కొండ గీతారెడ్డి, నాయకులు కొర్లపల్లి స్వామి, అంబాల మల్లేష్‌గౌడ్, సుందర్ నారాయణ, అశ్విన్‌సింగ్, రవినాయక్, తిరుమల్ పాల్గొన్నారు.

మల్కాజిగిరి అభివృద్ధికి ఈటలను గెలిపించండి: కార్పొరేటర్ లచ్చిరెడ్డి

వనస్థలిపురం: మల్కాజిగిరి అభివృద్ధికి మాజీ మంత్రి ఈటల రాజేందర్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని బీఎన్‌రెడ్డినగర్ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి అన్నారు. పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో భాగంగా కార్పొరేటర్ బీజేపీ శ్రేణులతో కలిసి పాదయాత్ర చేపట్టి బీజేపీ ఎంపీ అభ్యర్థి ఈటల రాజేందర్‌కు ఓట్లు వేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర నాయకుడు వనపల్లి శ్రీనివాస్‌రెడ్డి, డివిజన్ అధ్యక్షుడు కొంతం నవకిషోర్‌రెడ్డి, పురుశోత్తం రెడ్డి, రాజిరెడ్డి, రఘురామ్ నేత పాల్గొన్నారు.


మాట్లాడుతున్న బీజేపీ అభ్యర్థి ఈటల రాజేందర్

పోలింగ్ శాతాన్ని పెంచాలి: ఎమ్మెల్యే బలాల

చాదర్‌ఘాట్, మే 9 (ఆంధ్రజ్యోతి) : ఈనెల 13న జరగబోయే పార్లమెంట్ ఎన్నికల్లో హైదరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలోని అసెంబ్లీ సెగ్మెంట్‌ల వారీగా ఓటింగ్ శాతం పెంచేందుకు ప్రతి ఒక్కరూ తమ బాధ్యతగా వ్యవహరించాలని మలక్‌పేట ఎమ్మెల్యే అహ్మద్ బలాల విజ్ఞప్తి చేశారు. గురువారం మలక్‌పేటలో జరిగిన మేధావులు, విద్యా సంస్థల ప్రతినిధుల కమిటీ చైర్మన్ ఫజల్లూర్ రెహమాన్ ఖుర్రం అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇంతవరకు జరిగిన పార్లమెంట్ ఎన్నికల్లో హైదరాబాద్ నియోజకవర్గం పరిధిలో 40నుంచి 45 శాతం పోలింగ్ జరిగిందన్నారు. ఇతర నియోజకవర్గాల్లో జరిగినట్లుగా ఈసారి హైదరాబాద్ నియోజకవర్గంలో ఓటింగ్ శాతం కనీసం 70 నుంచి 85 శాతానికి పెంచేలా విద్యా సంస్థల ప్రతినిధులు, మేధావులు ఓటర్లకు అవగాహన కార్యక్రమాల ద్వారా చైతన్యపరచాలని ఆయన విజ్ఞప్తి చేశారు.


మాట్లాడుతున్న ఎమ్మెల్యే బలాల

హైదరాబాద్ ఎంపీ స్థానం కాంగ్రెస్‌దే: సమీర్

చాదర్‌ఘాట్, మే 9(ఆంధ్రజ్యోతి): ఈసారి ఎన్నికల్లో హైదరాబాద్ ఎంపీ స్థానం కాంగ్రెస్ పార్టీ కైవసం చేసుకోవడం ఖాయమని ఎంపీ అభ్యర్థి వలీ ఉల్లా సమీర్ ధీమా వ్యక్తం చేశారు. గురువారం చాదర్‌ఘాట్ నుంచి మలక్‌పేట అసెంబ్లీ నియోజకవర్గంలో ని డివిజన్ల వారీగా నిర్వహించిన భారీ ర్యాలీని ఆయన ప్రారంభించారు. టీపీసీసీ ప్రధాన కార్యదర్శి చెకొలేకర్ శ్రీనివాస్, మలక్‌పేట ఇన్‌చార్జి షేక్ అక్బర్‌తో పాటు అనేక మంది ర్యాలీలో పాల్గొని దారి పొడవునా పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. కేంద్రంలో కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తీసుకురావడానికి ప్రతి ఒక్క కార్యకర్త ప్రతి ఒక్క ఓటర్‌ను పలకరించి కాంగ్రెస్‌కు ఓటు వేసేలా చైతన్యం తీసుకురావాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

అక్రమ మద్యం పట్టివేత

సైదాబాద్, మే 9 (ఆంధ్రజ్యోతి): పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో సైదాబాద్ సింగరేణికాలనీ, చింతల్‌బస్తీ, ఖాజాబాగ్‌లలో మలక్‌పేట ఎక్సైజ్ పోలీసులు స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ఖాజాబాగ్‌లో ఓ ఇంటిపై దాడి చేసి 5.6 లీటర్ల మద్యాన్ని స్వాధీనం చేసుకుని అంబోతు లక్ష్మమ్మ అనే మహిళను అరెస్ట్ చేశారు. ఈ క్రమంలో బైక్‌పై అక్రమంగా మద్యం తరలిస్తున్న సరూర్‌నగర్‌కు చెందిన పరుశరాంను అదుపులోకి తీసుకుని 31 లీటర్ల మద్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు మలక్‌పేట ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ గోపాల్‌నాయక్ తెలిపారు. నిబంధనలకు విరుద్ధంగా ఇళ్లలో మద్యం నిల్వ చేసినా, తరలించినా కేసులు నమోదు చేస్తామని సికింద్రాబాద్ ఎక్సైజ్ అసిస్టెంట్ సూపరింటెండెంట్ ఎన్.శ్రీనివాస్‌రావు తెలిపారు. ఈ దాడుల్లో ఎన్‌ఫోర్స్‌మెంట్ ఇన్‌స్పెక్టర్లు గోపాల్, మహేశ్, చంద్రశేఖర్‌గౌడ్, కోటమ్మ, ఎస్ఐలు, సిబ్బంది, ట్రైనీ కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ గుర్తు తెలియని వ్యక్తి మృతి

అబ్దుల్లాపూర్‌మెట్: ఆస్పత్రిలో చికిత్స పొందుతూ గుర్తు తెలియని వ్యక్తి మృతిచెందిన సంఘటన అబ్దుల్లాపూర్‌మెట్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బాటసింగారంలోని పండ్ల మార్కెట్‌లో సుమారు 40 ఏళ్ల ఉన్న గుర్తు తెలియని వ్యక్తి గాయంతో పడి ఉన్నాడు. అక్కడ లాజిస్టిక్ పార్కులో సూపర్‌వైజర్‌గా పని చేస్తున్న గుర్రం సంజీవరెడ్డి అతడిని గమనించి 108తో పాటు అబ్దుల్లాపూర్‌మెట్ పోలీసులకు సమాచారం అందించాడు. వెంటనే అతడిని పోలీసులు ఉస్మానియా ఆస్పత్రికి తరలించి వైద్య పరీక్షలు చేయించారు. కాగా చికిత్స పొందుతూ అతడు బుధవారం రాత్రి మృతిచెందినట్లు పోలీసులు తెలిపారు. అతడి ఒంటిపై ఆకుపచ్చ, మెరూన్ రంగు షర్ట్, లేత ఆకుపచ్చ ప్యాంటు ధరించి ఉన్నట్లు తెలిపారు. ప్రస్తుతం అతడి మృతదేహం ఉస్మానియా మార్చురీలో ఉందని తెలిపారు. అతడి గురించి సమాచారం తెలిసిన వారు ఫోన్ నంబర్‌లో 8712662650, 8712662295లో సంప్రదించాలని కోరారు.


గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

మానసిక వ్యాధితో వ్యక్తి ఆత్మహత్య

సంతోష్‌నగర్, మే 9 (ఆంధ్రజ్యోతి): మానసిక వ్యాధితో బాధపడుతున్న వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన ఐఎస్ సదన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో గురువారం చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ వెంకటరామయ్య తెలిపిన వివరాల ప్రకారం.. చంపాపేటలోని వైశాలీనగర్‌కు చెందిన గడ్డం భరణికుమార్(45) ప్రైవేటు ఉద్యోగి. ఇతనికి భార్య వాణి, కుమారుడు ఉన్నారు. కొన్ని నెలలుగా ఉద్యోగం లేకపోవడంతో మద్యానికి బానిసై తీవ్ర మానసిక వేదనకు గురి అయ్యాడు. మూడు రోజుల క్రితం ఇంట్లో నుంచి బయటకు వెళ్లిన భరణికుమార్ గురువారం ఉదయం వినయ్‌నగర్‌కాలనీలో ఫుట్‌పాత్‌పై అనుమానాస్పద స్థితిలో మృతిచెంది ఉన్నాడు. స్థానికులు గమనించి పోలీసులకు సమాచారమందించారు. మృతుడి చేతి మణికట్టు వద్ద బ్లేడుతో కోసుకున్నట్లు పోలీసులు గుర్తించారు. విచారణ చేపట్టిన పోలీసులు మృతుడి ఆచూకీని గుర్తించి కుటుంబసభ్యులకు తెలియజేశారు.సోదరుడు రవికుమార్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.


భరణికుమార్ మృతదేహం

మజ్లి‌స్‌కు ప్రైవేట్ విద్యా సంస్థల జేఏసీ మద్దతు

హైదరాబాద్, మే 9(ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ లోకసభ స్థానంలో మజ్లిస్ పార్టీ అభ్యర్థి అసదుద్దీన్ ఒవైసీకి ప్రైవేట్ విద్యా సంస్థల జాయింట్ యాక్షన్ కమిటీ మద్దతు ప్రకటించింది. గురువారం మలక్‌పేట నల్గొండ చౌరస్తా మూన్‌ఫంక్షన్‌హాల్‌లో ప్రైవేట్ విద్యాసంస్థల జేఏసీ కన్వీనర్ ఫజల్ ఉర్‌రహ్మాన్ ఖుర్రం నేతృత్వంలో జరిగిన సమావేశంలో సుమారు 500 విద్యా సంస్థలకు చెందిన ప్రతినిధులు పాల్గొన్నారు. మలక్‌పేట ఎమ్మెల్యే బలాల ముఖ్యఅతిథిగా పాల్గొని మజ్లిస్‌కు మద్దతు ప్రకటించిన ప్రైవేట్ విద్యా సంస్థల ప్రతినిధులకు కృతజ్ఞతలు తెలిపారు.

బంగారం, వజ్రాలు, వెండి నగల స్వాధీనం

చాదర్‌ఘాట్, మే 9(ఆంధ్రజ్యోతి): కారులో తరలిస్తున్న బంగారం, వజ్రాలు, వెండి నగలను మలక్‌పేట పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఈసీ ఆదేశాల మేరకు మలక్‌పేట పోలీసులు గురువారం రాత్రి ఆస్మాన్‌ఘడ్‌లో వాహనాలను తనిఖీ చేస్తుండగా మలబార్ గోల్డ్‌కు చెందిన మారుతి ఓమిని కారులో బంగారం వజ్రాలు, వెండి నగలను తరలిస్తున్నట్లుగా గుర్తించారు. సరైన పత్రాలు లేకుండా తరలిస్తున్న నగలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. వీటి విలువ రూ.1.08కోట్ల వరకు ఉంటుందని పోలీసులు తెలిపారు. వీటిని ఎన్నికల అధికారులకు అప్పగించినట్లు ఎస్ఐ జయంత్ తెలిపారు.

ఆర్టీసీ బస్సు టైర్ల కిందపడి మహిళ మృతి

వనస్థలిపురం, మే 9 (ఆంధ్రజ్యోతి): ద్విచక్ర వాహనంపై వెళ్తున్న వారిని కారు ఢీకొట్టడంతో ఎదురుగా వస్తున్న ఆర్టీసీ బస్సు వెనుక టైర్ల కిందపడి మహిళ అక్కడికక్కడే మృతిచెందిన సంఘటన వనస్థలిపురం పోలీస్ స్టేషన్ పరిధిలో గురువారం రాత్రి చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. హయత్‌నగర్ రాఘవేంద్రకాలనీకి చెందిన సంగిశెట్టి ప్రమీల(50) మట్టపల్లి దంపతులు గురువారం రాత్రి తమ స్కూటీపై (టీఎస్07జీవై6657) కమలానగర్ మీదుగా వనస్థలిపురం రైతుబజార్ వైపు వస్తున్నారు. ఈ క్రమంలో రైతుబజార్ సమీపంలోని పెట్రోల్‌బంక్ వద్దకు రాగానే జైలో కారు(టీఎస్08యుఏ5204) వచ్చి వీరిని ఢీకొట్టింది. దీంతో స్కూటీ వెనుకాల ఉన్న ప్రమీల స్కూటీపై నుంచి ఎగిరిపడి ఎల్బీనగర్ నుంచి హయత్‌నగర్ వైపునకు ఎదురుగా వస్తున్న ఆర్టీసీ బస్సు(ఏపి11జెడ్7592) వెనుక టైర్ల కింద పడింది. ఇది గమనించని బస్సు డ్రైవర్ బస్సును ముందుకు కదిలిచ్చాడు. దీంతో ప్రమీల తలపై నుంచి బస్సు వెనుక టైర్లు వెళ్లడంతో ప్రమీల అక్కడికక్కడే మృతి చెందింది. సమాచారం అందుకున్న పోలీసులు పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ఉస్మానియాకు తరలించారు. ప్రమాదానికి కారణమైన కారు, బస్సు డ్రైవర్లను అదుపులోకి తీసుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

మైనర్‌ను వేధించి అపహరణకు పాల్పడిన నిందితుడికి జైలు, జరిమానా

- బాధితురాలికి నష్టపరిహారం చెల్లించాలని న్యాయమూర్తి తీర్పు

రంగారెడ్డి కోర్టులు, మే 9(ఆంధ్రజ్యోతి): మైనర్‌ను వేధించి అపహరణకు పాల్పడిన నిందితుడికి 10సంవత్సరాల కఠిన కారాగార శిక్ష, రూ. 11 వేలు జరిమానా విధించడంతో పాటు బాధితురాలికి లక్ష రూపాయలు నష్టపరిహారం చెల్లించాలని రంగారెడ్డి జిల్లా ఫాస్ట్ ట్రాక్ ప్రత్యేక న్యాయమూర్తి తీర్పు చెప్పారు. ప్రత్యేక పీపీ సునీత బర్ల కథనం ప్రకారం కర్మన్‌ఘాట్ ప్రాంతానికి చెందిన మహ్మద్ ఖాజా ఓ బాలికను ప్రేమ పేరుతో వేధింపులకు పాల్పడటంతో పాటు అపహరించాడు. బాధితురాలి తండ్రి సరూర్‌నగర్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసిన పోలీసులు సాక్ష్యాధారాలతో కోర్టులో ఛార్జిషీట్ దాఖలు చేశారు. సాక్షులను విచారించిన రంగారెడ్డి జిల్లా ఫాస్ట్ ట్రాక్ ప్రత్యేక న్యాయమూర్తి ఎన్‌కే పద్మావతి నిందితుడిని దోషిగా నిర్ధారించి తీర్పు ఇచ్చారు.

నవ దంపతుల మధ్య మనస్పర్ధలు

- వేధింపులు తాళలేక భార్య ఆత్మహత్య

దిల్‌సుఖ్‌నగర్, మే 9 (ఆంధ్రజ్యోతి): దంపతుల మధ్య వివాదం నేపథ్యంలో మనస్తాపానికి గురైన భార్య ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన సరూర్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఈ సంఘటనకు సంబంధించి సరూర్‌నగర్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. వనపర్తి జిల్లా కొత్తకోటకు చెందిన తిరుపతయ్య కుమార్తె గాయత్రి(19)ని ఫార్మాకంపెనీలో ఉద్యోగం చేస్తున్న బాలకృష్ణగౌడ్‌కు ఇచ్చి గత మార్చి 13వ తేదీన వివాహం జరిపించారు. పెళ్లైన తర్వాత బాలకృష్ణ, గాయత్రి దంపతులు కర్మన్‌ఘాట్‌లోని శ్రీరామ్‌నగర్ కాలనీలో గది అద్దెకు తీసుకుని నివాసం ఉంటున్నారు. దంపతులిద్దరితో పాటు బాలకృష్ణ తమ్ముడు శ్రీకాంత్‌గౌడ్ కూడా వారితోనే నివాసం ఉంటున్నాడు.

పెళ్లైన 15 రోజుల నుంచే వేధింపులు

పెళ్లైన 15 రోజుల వరకు వీరి కాపురం సజావుగా సాగింది. ఆ తర్వాత బాలకృష్ణ మానసికంగా, శారీరకంగా వేధిస్తున్నాడంటూ గాయత్రి తల్లి దండ్రులకు చెప్పుకుని బాధపడేది. అయితే సర్దుకుపోవాలని తల్లిదండ్రులు నచ్చజెప్పారు. కాగా ఇటీవల వేధింపులు అధికమవడంతో 15రోజుల క్రితం గాయత్రి పుట్టింటికి వెళ్లింది. దీంతో కుటుంబ పెద్దలు దంపతులిద్దర్ని పిలిపించి, కౌన్సిలింగ్ ఇచ్చి గొడవలు లేకుండా కాపురం చేసుకోవాలని నచ్చజెప్పారు. దీంతో గాయత్రి తిరిగి భర్తతో కలిసి కర్మన్‌ఘాట్‌కు వచ్చింది. అయినప్పటికీ వారిమధ్య గొడవలు సద్దుమణగలేదు. బుధవారం మళ్లీ కొట్టాడని గాయత్రి తల్లిదండ్రులకు ఫోన్‌చేసి ఏడ్చింది. దీంతో ఆందోళనకు గురైన తండ్రి తిరుపతయ్య బుధవారం రాత్రి కూతురుకు ఫోన్ చేశాడు. ఆమె ఫోన్ ఎత్తకపోవడంతో అల్లుడు బాలకృష్ణకు ఫోన్‌చేశాడు. బాలకృష్ణ ఫోన్‌ను ఆయన సోదరి రాణి లిఫ్ట్ చేసి గాయత్రి ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుందని వెల్లడించింది. దీంతో తిరుపతయ్య కుటుంబ సభ్యులు హుటాహుటిన కర్మన్‌ఘాట్‌లోని కూతురు ఇంటికి వచ్చారు. అల్లుడు బాలకృష్ణ, అతని సోదరుడు శ్రీకాంత్‌ల వేధింపుల మూలంగానే తన కూతురు ఆత్మహత్య చేసుకుందని సరూర్‌నగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నారు.